ఆకాశమంతా తిరిగి తిరిగి ఆటలాడి అలసిపోయిన ఎఱ్ఱబడిన ముఖంతో సూర్యుడు గుహాన్ముఖుడైనాడు. పశ్చిమ దిక్సతి సూర్యుడ్ని ఒళ్ళోకి తీసుకుంటున్నది పసిపిల్లవాడు చిందర వందరగా తన్నేసిన బొమ్మల్లా చెదిరిపోయి వున్నయి మబ్బులు.

హేమంత శర్వరి తొంగిచూస్తున్నది. సన్నగా చలి ప్రారంభమైంది.

జయలక్ష్మి మరోసారి వాచి చూసుకుంది విసుగ్గా. ఆరు పది!

ఏం మనిషనుకోవాలి ఈయన్ని?

ప్రొద్దున మరీ మరీ చెప్పింది నాలుగు గంటలకే రమ్మని, నరేనని చేతిలో చేయివేసి చెప్పివెళ్ళారు. ఆఫీసుకుపోతే ఇంట్లో మనుష్యులు గుర్తుండరు కాబోలు ఈయనేనా ఉద్యోగం చేసేది? మరెవరూ చేయటంలా? పక్కింటి శారదభర్త ఎంత బాంకులో ఉద్యోగమైనా సరిగా మూడున్నరకే వచ్చేవాడు. నాలుగున్నరకల్లా ఆవిడ ఆయన బజారుకు బయలుదేరారు. వాళ్ళిద్దరూ అలా నవ్వుకుంటూ పోతుంటే తను ఈర్ష్యతో చూస్తూ నిల్చుండిపోయింది. నిజానికి ఆయనకి వచ్చే జీతం తమకన్నా తక్కువే! అయితే ఏం? ఆవిడ ముఖంలో ఎప్పుడు తృప్తి, సంతోషం వెలుగుతూ వుంటయి. తనే ఏదో వెలితితో బాధపడుతుంది రేపు ఆవిడ వచ్చి, 'ఇదిగో జయలక్ష్మి ఈ చీర కొన్నాం బాగుందా, నిన్న సాయంత్రం ఇద్దరం కలసి వెళ్ళాం. నాదేమీ లేదు అంతా వారి సెలక్షన్. 'ప్రతిసారి పండక్కి ఎందుకు? ఈసారి కొందాం లేండి' అంటే వినలేదు 'కట్టుకోవాల్సిందే' అన్నారు ' అంటుంది.

అంతటితో వూరుకోదు 'మీరేం కొనుక్కోలేదా?' అంటుంది అంత అడిగితే ఏదో సమాధానం చెప్పలేకపోలేదు ప్రతి పండక్కి చీర కొంటేనేనా ఏం హోదా తెలిసేది? కాని ఈ జవాబుతో మనస్సు తృప్తిపడదు. సిగ్గుతో కుమిలిపోతుంది!

అసలు ఈసారైనా తప్పకుండా ఇంటికి వెళ్ళాలనుకుంది నాన్న అమ్మ మరీ మరీ రమ్మని వ్రాశారు. అన్నయ్య క్రిందటిసారి వచ్చినప్పుడు తప్పకుండా రావాలని చెప్పి, ఆయనచేత ఒట్టు వేయించుకుని వెళ్ళాడు. పెళ్ళయి ఇక్కడికి వచ్చిన ఏడాదిలో ఒక్కసారి కూడా వెళ్ళలేదు. అమ్మా నాన్న ఉండబట్టలేక చూసివెళ్ళారు ఈ మనిషితో ఏ సరదాలు తీరతయి. ఆఫీసుంటే వేరే అన్నము నీళ్ళు అక్కర్లేదు. పండుగ ఇరవయి రోజులుండగానే శలవకోసరం ప్రయత్నించమంది. శ్రీధర్ నవ్వేసి తలూపాడు. తనకి ధైర్యం వచ్చింది.

'అయితే వస్తానని వ్రాసేస్తాను' అంది.

'పోవాలనుకుంటే పోదాం కాని వస్తున్నామని వ్రాయాలా ఏం?'

'అవును. అల్లుడుగారికి పూలదండలతో

[illegible] వేస్తుంటారు'

ఆవిడకి మొన్నకి మొన్న చల్లగా చెప్పే వాడు తలవ దొరకదని. పైగా కావాలంటే తనని వెళ్ళమంటారు. అంతా అబద్ధం. ఈయన అడిగితే తలవ ఇవ్వరూ? అనలేద గురు. ఇంత కష్టపడి పనిచేస్తారంటే ఈయనకి గొప్ప ఏమిటో ఆ గొప్ప?

జయలక్ష్మి మనస్సు అశాంతితో నిండి పోయింది. నెలరోజులనుంచి ఉత్సాహం కూడబెట్టిన మనస్సు నీళ్ళమూటలా అయింది.

కళ్ళల్లో నీరు తిరిగింది!

అమ్మా వాళ్ళు ఆయన ఉద్యోగం, హోదా చూసి మురిసి పోతుంటారు కాని తనబాధ ఎవరికి తెలుస్తుంది? నిజానికి ఒంటరి తనానికి మించిన శిక్ష వేరే ఏముంది?

ఆయన వస్తారని గంపెడాశతో నాలుగు గంటలకే స్నానంచేసి ఆయన కిష్టమైన గులాబీరంగు షిఫాన్ చీర కట్టుకుంది. పెరట్లో పూసిన సన్న జాజిపూలు కోసుకువచ్చి మాల కట్టుకుని తల్లో పెట్టుకుంది సన్న జాజిపూల పరిమళం మనస్సునిండా నిండి అదోవిధమైన అనుభూతితో పులకించి పోయింది

కాని ఇది అలాగే అయింది. తనని చూసి నవ్వి కాలం క్రమంగా జారి పోతున్నది

జయలక్ష్మి కళ్ళు మరోసారి రిస్టు వాచిని చూసినయి ఏడు కావస్తున్నది

విసుగ్గా కర్టెన్ తొలగించి చూసింది.

మూర్తిగారు, శారద తిరిగి వస్తున్నారు ఇహ ఇప్పుడే వస్తుందేమో ఆవిడ చీర చూపించటానికి? ఖర్మ—

జయలక్ష్మి గుండెల్లో ఈర్ష్య తాచు పాములా బుస్సుమంది

తన నిరీక్షణ ఇలా వ్యర్థమైపోయింది, అసలు ఆయనకి తన వునికే గుర్తుండదేమో ఆఫీసుకుపోతే. -ఊహూ! అదేం కాదు, నిర్లక్ష్యం, ఆయన దృష్టిలో తను ఒక దాసి తన డబ్బు, ఉద్యోగం, చదువు చూసి కాళ్ళదగ్గరపడి వుంటానను కుంటారేమో ఆయన

జయలక్ష్మి కోపం తారస్థాయి చేరుకుంది.

శారద గారింట్లోంచి నవ్వులు వినబడుతున్నాయి జయలక్ష్మి అక్కడ నిల్చోలేక లోపలి కొచ్చి అద్దం ముందు కూర్చుంది.

అద్దంలో ప్రతిబింబం జయలక్ష్మి అందాన్ని వెక్కిరించింది. ఆ అందంలోంచి ఆనందం ఆవిర్భవించినప్పుడే దాని విలువ పుష్పకు అందము, వాసనా రెండువుంటే? జయలక్ష్మి హృదయంలో అగ్నిపర్వతం బ్రద్దలయింది. అసంపూర్ణమైన ఈ అనుభూతి, సమాధి చేయబడుతున్న కోరిక, ఆమెలోని స్త్రీ సహజమయిన దౌర్బల్యాన్ని దెబ్బ కొట్టినాయి.

ఈ నిరీక్షణలో ఎంతహాయి! దాని ఫలితాన్ని కూడా పొందగలిగితే అందులో ఎంత తీపి! ఊహే ఇంత మధురంగా వుంటే అనుభవమైతే ఇంకెలా వుంటుందో?

ఈ క్షణాన్ని శాశ్వితంచేసి గుండెల్లో దాచుకుని మురిసిపోవాలను కున్న జయలక్ష్మి, ఆ అనుభూతి తననుంచి వేరై తననిచూసి పకపక నవ్వుతుంటే నిస్సహాయురాలై దిండులో తలదూర్చి బావురుమంది.

* * *

జయలక్ష్మితో పాటుగా శ్రీధర్ కోసరం నిరీక్షిస్తున్న వ్యక్తి మరొకడున్నాడు. వాడు వాసు శ్రీధర్ ఇంట్లో జవాను.

శ్రీధర్ రాకకోసరం ఎదురుచూస్తూ వాకిట్లో పున్నాగ చెట్టుక్రింద కూర్చున్నాడు. వాడికి ఏమీ తోచటంలేదు. వాడి మనస్సులో భావాలు మసలుతున్నాయి దిగులు వాడి హృదయాన్ని ఆవరించింది చీకటి జాలిగా వాణ్ణి ఒడిలోకి తీసుకుంది. పున్నాగపూలు వాడిచుట్టూ ఆశల్లా రాలిపోతున్నాయి. ఒక పువ్వును చేతిలోకి తీసుకుని వేలిమీద పిచ్చిగీతలు గీస్తూ చూస్తున్నాడు

వాడి హృదయంలో ఒకే ఒక భావం స్థిరంగా కాపురం ఏర్పరుచుకున్నది

అయ్యగారు ఈ రాత్రికి అసలు రారేమో? కొంపదీసి, ఏ క్యాంప్ కైనా వెళితే?

వాడి హృదయం బరువెక్కింది మనస్సు అయోమయంగా చూసింది

కూర్చోలేక లేచి తీసుకుని వీధిలోకి వచ్చాడు సగం కాగి ఆరిన బీడిని నిక్కరు జేబులోంచి తీసి వెలిగించాడు.

వాడి కళ్ళకు దూరంగా లైటు కనపడింది. అయ్యగారు వస్తున్నారేమో? వాడి కళ్ళు ఆశతో మిలమిల లాడినయి ఉత్సాహంగా చూశాడు కాని అది సైకిలు. ఎవరో? నిరాశతో వెనక్కి తిరిగాడు.

[illegible]

లేకపోలేదు. వాడికి మొన్న మొన్ననే పెళ్ళయింది. పెళ్ళయిన తరువాత వచ్చిన మొదటి పండుగ ఇది. అందుకని ముందుగా చెప్పకుండా ఓ చీర కొనుక్కువెళ్ళి భార్యామణిని ఆనందాశ్చర్యాలలో ముంచివెయ్యాలని కోరిక కలిగింది అయితే వాడిదగ్గర డబ్బులేదు నెలకు వచ్చే ఆ కాస్తతో ఏదో నెట్టుకు వస్తున్నాడు. అయినా ఈ ఆనందం కోసరం ఓ పదిహేను రూపాయలైనా ఖర్చు పెట్టాలని నిశ్చయించుకున్నాడు. అందుకని అయ్యగారిని ఓ ఇరవయి రూపాయలు అప్పు అడిగాడు. నెల నెల జీతంలో అయిదు రూపాయలు పట్టుకోమన్నాడు అలా అయితే నాలుగు నెలల్లో బాకీ తీరుతుంది. తనకీ కష్టం వుండదు.

అంతా విని శ్రీధర్ సిగ్గుతో ఎర్రబడిన వాడి ముఖం చూసి నవ్వి, 'సరేలేరా, పండుగ ఇంకా పదిరోజులుందిగా, ఇస్తాలే' అన్నాడు

నిజానికి ఇంతవరకు శ్రీధర్ ని అడిగి లేదనిపించుకున్న రోజులేదు

ఇవ్వాళ ప్రొద్దున్నే బూట్లు పాలిష్ చేస్తుంటే గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి. సగం తెరిచిన కిటికీలోంచి శ్రీధర్ జయలక్ష్మి కనిపిస్తున్నారు

'ఈ రోజైనా త్వరగా వస్తారా? రోజు వున్నదే ఆఫీసు' అంది జయలక్ష్మి

శ్రీధర్ ఓవల్టిన్ సిప్ చేస్తూ, 'ఏం? ఎందుకని?' అన్నాడు

జయలక్ష్మి పెదవులు మన్మధుని ధనుస్సులా వంగినయి

'తెలీనట్టు.' అంది

'నిజంగా తెలీదు. ఏమిటో చెప్పు.'

'రేపు సంక్రాంతి'

ఆమె ముఖం కాంతితో నిండిపోయింది

'చీర కొనాలి'

'కొనదా? పుట్టింటికి వెళ్ళట, ఎలాగూలేదు చీరైనా కొనదా?'

శ్రీధర్ నవ్వి 'దేవిగారు ఆజ్ఞాపించటం కాదనటం కూడానా?' అన్నాడు

'ఇష్టం లేకపోతే మానేయండి'

'అదిగో, అప్పుడే కోపంవచ్చింది కోపం వస్తే నువ్వు ఎంత అందంగా వుంటావో తెలుసా? ఆడవాళ్ళకి సిగ్గే సింగారం అన్నారు గాని కోపమే సింగారం అని వుండవలసింది.'

జయలక్ష్మికి వికారంగా కోపం వస్తోంది.
-తీసుకున్నారుగా ధన్యులం. మీ థీసిస్‌కి డాక్టరేట్ ఇస్తారు. ఏ యూనివర్సిటీకైనా పంపండి !'

'నాకు డాక్టరేట్ అక్కర్లేదు. ఇది కావాలి ' అన్నాడు.

వాసుకు షాక్ కొట్టినట్లయింది. వాడి గుండెలు దడదడ లాడినయి. సిగ్గుతో వాడిముఖం ఎర్రబడింది. ఒకవిచిత్రమైన అనుభూతి దేహమంతా కదలాడింది.

'ఛీ, ఛీ, అక్కడ వాసు కూడా వున్నాడు ' అంది జయలక్ష్మి బుగ్గలు తుడుచు కుంటూ

'అయితే వాసు లేకపోతే ఇష్టమేనన్న మాట ' అన్నాడు శ్రీధర్.

'ఇలా నన్ను మాటల్లో పడేసి వెళ్ళి పోతారు '

'చిన్నపిల్లనా ?'

'ఇంతకీ చీర కొంటారా ? కొనరా?'

'గాడ్రెజ్ బీరువాలో ఎంతుందో చూడు. లేకపోతే బాంకినుంచి తీసి పంపు తాను. వాసు తోడు వస్తాడు..'

జయలక్ష్మి ముఖం ముడుచుకున్న పద్మంలా అయింది.

'నాకేమక్కర్లేదు.'

'ఆదేం. అలక?'

'లేకపోతే? ప్రతిసారి ఇంతే? ఇద్దరం సరదాగా వెళ్ళి కొనుక్కోవాలనుకుంటే—'

శ్రీధర్ నవ్వేసి, 'ఓయస్ దానికేం, ఇంతపాటి మొగాడ్నై వుండి ఈమాత్రం

విలువలు

కోరిక తీర్చలేనా ?' అన్నాడు

'అయితే ఎన్నిగంటలకి వస్తారు?'

'నాలుగు.'

'తప్పకుండా'

'ఈ ముద్దు సాక్షి.'

శ్రీధర్ వెళ్లబోయేటప్పుడు వాడు అక్కడ లేడు. ఓవల్టీను కప్పుని కడగటా నికి వెళ్ళాడు వాడు వచ్చేసరికి శ్రీధర్ స్కూటర్ స్టార్ట్‌చేసి వెళ్ళిపోతున్నాడు. ఇక ఎలా అడిగేది? వాడికి మాట పెగల్లేదు. రేపే పండుగ. ఇన్నాళ్లనుంచి అడుగనందుకు మనసులోనే తిట్టుకున్నాడు వాడి కళ్ళ ముందే శ్రీధర్ వెళ్ళిపోయాడు. వాడు నిరాశతో నిలబడిపోయాడు.

* * *

జయలక్ష్మి అద్దం ముందు ఎంతసేపో కూర్చున్నది. ఆ ప్రతిబింబం ఆమెని వెక్కి రిస్తున్నది తలుచుకున్నకొద్దీ ఆమెకు కోపం, ఉక్రోషం అంత కంతకు ఎక్కువైపోతు న్నాయి.

''ఇప్పటికైనా తెలుసుకో, నీ విలువ యింతే. నీవంటేనే నిర్లక్ష్యం నువ్వెంత ప్రేమిస్తున్నా నీ కోసం అతి స్వల్ప త్యాగాన్ని కూడా చేయలేడతను నువ్వు మాత్రం ప్రతి చిన్న విషయంలోనూ అతని ఆధిక్యతని గుర్తించి గౌరవిస్తావు. కాని అతను నీ ఉనికే గుర్తించడం లేదు.' అంతర్యుద్ధం పరాకాష్ఠనందుకుంది.



జయలక్ష్మికి తనమీద తనకే జాలి కలి గింది అహం ఎదురుతిరిగింది. ఏదో చెప్ప లేని కసి. తను అతనికి అర్ధాంగి కాదు. దాసి !

జయలక్ష్మి వివేకాన్ని కోల్పోయింది. తన భవిష్యత్తునెవరో సమూలంగా పెక లించి వేస్తున్నట్లు అనుభూతి పొందింది. ఆవేశంలో కట్టుకున్న పట్టుచీర విప్పేసి మరో పాతచీర కట్టుకుంది. ఆమె మనస్సు బ్రద్దలైంది. దిండులో తలదూర్చి బావురు మంది.

పున్నాగచెట్టు క్రింద కూర్చున్న వాసు మెల్లగా లోపలికి వచ్చాడు వాడంతకు మునుపు రెండసార్లు వచ్చాడు. ఇంతవరకు అయ్యగారు రాలేదు. వస్తారో రారో తెలీదు. కేంపుకు వెళ్ళారేమొ? రాకపోతే ఎలా ? తన మొహం చూసి కొట్లో ఎవరూ అప్పివ్వరు అందులో పండగపూట. వాడి మనస్సులో జాలిగా చూసే భార్య ముఖం కనబడింది నిజానికి చీర కావాలని చంద్రి అడుగలేదు. తనకే బుద్ధి పుట్టింది తన సమర్థతని అది గుర్తించాలని ఆశ. ఆ ఆశలో ఆనందం వుంది దాన్ని పోగొట్టు కోలేదు

ఇన్నాళ్ళూ అయ్యగారే ఇస్తారని వూరు కున్నాడు మరిచిపోయారో ఏమో? అమ్మ గారి నడిగితే ? ఇస్తారో ? యివ్వరో ? కనీసం అమ్మగారి దగ్గర వుండకపోతుందా ? అడిగి చూస్తే !

తీరా గది దగ్గరకు వచ్చేసరికి అడిగే ధైర్యం లేకపోయింది. అమ్మగార్ని ఇంత వరకు ఎప్పుడు అడగలేదు. అదీగాక అమ్మ గారదోలా వున్నారు. ఎంతోసేపు మథన పడి తన బలహీనతకి తనే తిట్టుకుని వెళ్ళి పోయాడు. కాని మనసులో ఆరాటం ఆప లేకపోతున్నాడు. బాధ అణుచుకోవటం చాలా కష్టం. ఏమైతే అయిందని వచ్చాడు

జయలక్ష్మి మరో వైపు తిరిగి పడు కుంది. వాడు రెండుసార్లు రావటం వెళ్ళ టం ఆమెకి తెలీదు. ఆమె కళ్ళు వర్షిస్తు న్నాయని వాసుకి తెలీదు.

'అమ్మగారు' అన్నాడు.

జయలక్ష్మి చప్పున కళ్ళు తుడుచుకుని లేచి కూర్చుంది.

'ఏం?' అంది.

[illegible] ఇంకా రాలేదమ్మా

[illegible]

'[illegible]. ఏం చెప్పలేవా?'

వాడు మాట్లాడలేదు. మాటలు మనసులోనే ఆగిపోయినయి

'పో పరవాలేదు నేనుండగలను'

వాసుకేం చెప్పటానికి తోచలేదు.

జయలక్ష్మి వాడికేదో కావాలని గ్రహించింది. అయినా తనంతతానుగా 'ఏం కావాలిరా' అని అడుగలేదు. అడిగివుంటే వాడికి చెప్పటం సులభమయ్యేది.

'అమ్మగారు.'

'అమ్మగారు అమ్మగారు అనకపోతే ఏం కావాలో చెప్పరాదూ?'

వాసు చిన్నబుచ్చుకున్నాడు అసలు ఆవిడ్ని అడుగకూడదనుకుంటూనే వచ్చాడు. ఆవిడ కెందుకంత కోపం?

'ఇరవయి రూపాయిలు కావాలమ్మగారు'

'ఎందుకు ?'

'కావాలమ్మగారు.'

'ఎందుకో చెప్పకూడదా?'

'చీరకావాలమ్మగారు' అన్నాడు సిగ్గుపడుతూ.

జయలక్ష్మికి గుండెల్లో శూలం పెట్టి పొడిచినట్లయింది.

'చీరా ?' అంది [illegible] గొంతుతో.

'అవునమ్మగారు.'

'అయ్యగారిని అడుగలేకపోయావా ?'

'అడిగానమ్మగారు. నెల జీతంలో అయిదు రూపాయలు పట్టుకో మన్నారు. వచ్చే [illegible].'

'[illegible].'

విలువలు

'అయ్యగారు రాలేదమ్మగారు'

జయలక్ష్మికి ఈర్ష్య కలిగింది.

'ఏమో, ఎన్నింటికి వస్తారో? అయినా ఇరవయి రూపాయలకేం చీరవస్తుందిరా కనీసం యాభయి అరవయి అయినా పెట్టాలి' అని వాడిని నిరుత్సాహ పరచటానికి ప్రయత్నించింది

వాసు జాలిగా నవ్వాడు.

'అంత డబ్బు పెట్టి కొనగలమా?' అన్నట్లుంది ఆనవ్వు

'మీ దగ్గరుంటే ఇయ్యండమ్మా'

జయలక్ష్మి అదోలా నవ్వింది

'నిజమే! కాని నా దగ్గర ఎక్కడుంటుందిరా? అంతా అయ్యగారే చూసుకుంటారాయే.' అంది

నిజానికి జయలక్ష్మి దగ్గర డబ్బు లేక పోలేదు కాని తనకులేని సంతోషం వాళ్ళు పొందటం ఆమె కిష్టంలేదు చీర కొంటానన్నప్పుడే అసూయ జనించింది వాడు చీరకికాక మరి దేనికడిగినా ఇచ్చి వుండేదేమో?

వాసు తల వంచుకుని వచ్చేశాడు వాడికి జీవితంమీద అసహ్యం కలిగింది తన అసమర్థతకి ఏడుపు వచ్చింది చీకట్లో వాడిముఖం మరింత నల్లబడింది.

అయితే వాడ్ని అదృష్టం వదిలిపెట్టలేదు, వాడు పున్నాగ చెట్టుక్రింద రెండు నిముషాలు కూర్చున్నాడో లేదో శ్రీధర్ వచ్చాడు. స్కూటర్ లైటు వాడిమీద పడింది

శ్రీధర్ వాడ్ని చూశాడు

'ఏరా, ఇంకా వున్నావా? వెళ్ళకపోయావా?' అన్నాడు.

వాసు శ్రీధర్‌వంక జాలిగా చూశాడు.

శ్రీధర్‌కి గుర్తు వచ్చింది.

'అవును, నువ్వు డబ్బుకావాలన్నావుగదూ! మర్చిపోయాను ఇంకా బట్టల కొట్లు తెరిచే వున్నయి ఇదిగో— అంటూ పర్సు తీసి రెండు పదిరూపాయల నోట్లు చేతిలో పెట్టాడు

వాసు కళ్ళు కృతజ్ఞతతో మెరిసాయి. ఆనందంతో వాడికి మాటలు కరువయినయి. రెండు చేతులు జోడించి శ్రీధర్‌కి నమస్కారం చేశాడు

'పోయిరారా' అన్నాడు శ్రీధర్ అప్యాయంగా బుజంతట్టి

'వస్తానయ్యా'

వాసు వెళ్ళిపోయినాడు

'జయా!' ఉషారుగా ఈల వేసుకుంటూ వచ్చాడు

జయలక్ష్మి పలుకలేదు

'అలిగితివా, సఖీ ప్రియ—' రాగయుక్తంగా పాడుతూ జయలక్ష్మిని తన వైపుకు త్రిప్పుకోపోయాడు.

జయలక్ష్మి చెయ్యి విదిలించుకుంది

'కోపమే ఎందుకబ్బా?' అని కాసేపు ఆలోచించి 'ఓ, నాలుగు గంటలకే వస్తానని రాలేదనా? సారీ జయా. ఏంచేయను? అనుకోకుండా పని తగిలింది అప్పటికీ అయిదు గంటలకల్లా పని పూర్తిచేసి నిలబడ్డాను ఇంతలో మా ఆఫీసరు, భార్య బజారు రమ్మని కూర్చున్నారు ఏం చేయను చెప్పు? ఎలా తప్పించుకుందా మనుకున్నా వదలందే.'

జయలక్ష్మి వినదలచుకోలేదు. కని వింటున్నది.

ఎంత చక్కని కథ చెబుతారు?

'వాళ్ళతో బజారు వెళ్ళి వచ్చేసరికి ఆలస్యమైపోయింది ఇంతకీ చీర లేకపోతే గదా? చీర తెచ్చాను చూడు, ఎంత బాగుందో? నీ కిష్టమైన కలర్ ఇటు చూడు మరి—' జయలక్ష్మి కళ్ళు తెరవలేదు.

'మై గుడ్‌నెస్ ప్రణయ కలహమా?



మరి కొంతసేపు బ్రతిమాలుదును గానీ ఆకలేస్తుంది కావాలంటే అన్నం తిన్న తరువాత తెల్లవార్లూ బ్రతిమాలమన్నా సరే. జయా, ప్లీజ్—'

'అవును. మీ ఆఫీసర్ చేసిన మాత్రం నేను చేయలేదు. వారికున్న విలువ నాకు లేదు. నేను మీ దృష్టిలో పని చేసే యంత్రాన్ని' అంది గద్గదస్వరంతో.

'అరె ఏడుస్తున్నావా ? ఎందుకు? చీర తెచ్చాగా ?'

'ఆఁ తెచ్చారు. కాని నా కోరికని దాదాపు సమాధి చేశారు. మనిద్దరం వెళ్లి తెచ్చుకుందా మనుకున్నాను. మీ ప్రక్కన అలా నడుస్తుంటే వింత తీయని అనుభూతి కలుగుతుందో, లోకం అసూయతో మన వంక చూస్తుంటే నాకెంత తృప్తి కలుగుతుందో అవేవి దక్కకుండా చేశారు'

శ్రీధర్ మాట్లాడలేదు. అతనికి జయలక్ష్మి బాధ అర్థమైంది.

'మీ చీర నాకు వద్దు వేనసలు కట్టుకోను' అంది.

ఆమె మనస్సు కోపంతో నిండి పోతున్నది.

'బాగుంది. అయితే నేను కట్టుకోవాల్సిందే. అరె, అలా నలపకు. కొట్టువాడు తీసుకోడు. అసలు చూడకుండానే వద్దనేస్తే ఎలా ? దాని ఖరీదెంతో తెలుసా? నూట పది రూపాయలు. మా ఆఫీసరు భార్య కూడా మెచ్చుకుంది.

'అయితే ఇది కూడా ఆఫీసర్ భార్యకో లేకపోతే వాను మీకోసరం ఎదురుచూస్తున్నాడు. వాడికో ఇవ్వండి !'

ఈ ఒక్కమాటతో అతనికి జయలక్ష్మి పైన కోపం వచ్చింది. అయితే ఆమె సంగతి తెలుసు. తనేమైనా అంటే మరీ రెచ్చిపోతుంది.

'వాను నిన్ను డబ్బడిగాడా?'

'అందరికీ ఇచ్చేందుకు నా దగ్గర డబ్బుంటుందా ఏం ?'

ఆమె ప్రతి మాట బుసకొడుతున్నది.

'నీ దెంత మిధ్యా సంస్కారం జయా !' అనుకున్నాడు ఆమె బలహీనతకు జాలి పడుతూ.

'నిజంగా చెప్పండి. నా ఉనికిని మీరు గుర్తించనప్పుడు నాకు బాధ కాక యేం మిగులుతోంది ? నేను స్త్రీని, నాకూ ఆశలు; అవసరాలు, కోరికలు వుంటాయని మీ కొకనాడైనా అనిపిస్తుందా?' అంది ఏడుస్తూ.

అతను నిర్ఘాంతపోయాడు.

'జయా ! ఎంత నీచంగా అంచనా వేస్తున్నావు నన్ను ? నా వ్యక్తిత్వం మీద అంత అపనమ్మకమా ? నీ కోరికలేం తీర్చలేదు? ఈ రోజువరకు నీకేం తక్కువ చేశాను?'

'మనశ్శాంతి తప్ప'

శ్రీధర్ విసుగ్గా లేచి షర్టు విప్పుకుంటూ 'అది నీ తెలివి తక్కువ. ఈ రోజు త్వరగా రాలేకపోయాను. కాదనను. కాని రావాలని

డాక్టర్‌వాసూస్
కేశరాజ్ హెయిర్ ఆయిల్
మెడికేటెడ్ & పెర్ఫ్యూమ్డ్

అకాలములో జుట్టు నెరియుట, పలచబడుట, వూడిపోవుటలను మాన్పును

నిరంతర మానసిక పరిశ్రమవలన వేడెక్కి మొద్దుబారిన మెదడుకు చలువచేసి వుత్తేజపరచును

ఎండ, నిద్రలేమి, మానసిక పరిశ్రమలవల్ల వచ్చు తలనొప్పి, కళ్లమంటలు, పోటు, నీరు కారుటలను మాన్పును.

ఆరోగ్యవంతమైన కేశ సంపదను వృద్ధిపరచి అందమును పెంపొందించును

కేశ సౌందర్యమునకు సాటిలేనిది కేశరాజ్ హెయిర్ ఆయిల్

మీ కేశములకు సంబంధించిన సమస్యలకు [illegible]మైన సలహా కావాలా ?

వివరములతో వుత్తరం వ్రాయండి.

సెల్స్ & ప్రచారపు డిపార్టుమెంటు :
డాక్టర్ వాసూ ప్రోడక్ట్సు
రాజమండ్రి-2

ఐటెక్స
సౌందర్య సాధనములు
ఐటెక్స కాటుక
ఐటెక్స బింది
కుంకుం చాందు
ఐటెక్స
కుం[illegible]ం పేస్టు



ARAVIND LABORATORIES, P. B. 1415, MADRAS-17.

లేక కాదు. నేను అక్కడి స్వతంత్రుణ్ని కాదు. మన అవసరం ఎలాంటిదో మనతోటి వాళ్లది కూడా అలాంటిదే ననుకుంటాను. లేకపోతే వర్కంతా ఏ శర్మనెత్తినో పడేసి వద్దును దాన్ని నువ్వు మహాపరాధంగా పరిగణిస్తా వనుకోలేదు చదువుకున్న దానివి నా పరిస్థితి నర్థం చేసుకోగలవనుకుంటాను'

జయ మాట్లాడలేదు

'సరె, రేపు నువ్వే తెలుసుకుంటావు. నే కోరేది ఒకటి. మనిషికి చిక్కు సమస్య మనస్సు లేనిపోనివి వూహించి మనస్సు పాడు చేసుకోకు నాకు ఆకలి వేసోంది. అన్నం పెట్టు.'

'ఇంకా వండలేదు'

'ఇంకా ?' అన్నాడు ఆశ్చర్యంగా.

'ఇప్పటిదాకా మీ కథ, ఇంతకు ముందు దాకా మీ వాసు కథ వినటంతో సరిపోయింది ఇప్పుడు వండుతాను'

'వాసుకి డబ్బిస్తా వనుకున్నాను. ఇప్పటిదాకా నాకోసరం కూర్చున్నాడు'

'నా దగ్గ రేమన్నా డబ్బుచెట్టు వుందా?'

శ్రీధర్ ఇంక మాట్లాడలేద. అతని మనస్సంతా చికాకుగా అయిపోయింది.

రేపు పండుగ. ఆఫీసుకి శలవు ఎంతో ఉత్సాహంతో వచ్చాడు. నిజానికి ఇప్పటికైనా రాగలిగాడు. అదంతా జయ కెలా తెలుస్తుంది? ఏమిటో ఒక్కోరోజు ఇలాగే ప్రసరిస్తుంది. అర్థం కాదు జయ మనస్తత్వం

శ్రీధర్ వాకిట్లో పడక కుర్చీలో పడుకుని సిగరెట్ వెలిగించాడు.

* * *

శ్రీధర్ భోంచేసి పడుకోటానికి వెళ్ళబోతూ అప్రయత్నంగా భార్య బీరువాతెరిచి చూశాడు అందులో నూటఇరవై రూపాయ లున్నాయి

శ్రీధర్ భారంగా నిట్టూర్చాడు.

సరిగా ఈ సమయానికి వాసు పందొమ్మిది రూపాయలుపెట్టి చీర కొనుక్కుని ఇంటి కెళ్లాడు. చంద్రి వాడికోసరం వేయి కళ్లతో ఎదురుచూస్తు నిలుచుంది.

'ఏటయింది. యింత ఆలీసెం?' అంది ఆత్రంగా. వాడిముఖం రెండు చేతులతో తడుముతూ.

'నీకేటి తెచ్చావో చెప్పుకో?'

'నాకెట్టా తెలుత్తది?'

వెన్నెల దాని కళ్లలో ప్రతిఫలించి పక్కున నవ్వింది.

వాడు చేతిలోని చీరతీసి 'సూడు, ఎట్టుందో?' అన్నాడు.

దాని గుండెల్లో ఆనందం కట్టలు తెంచుకుంది.

'శావాబా గుంది ఎంతపెట్టి తెచ్చినావు?'

'ఎంతయిందో నీకేటి? అయ్యగారిచ్చారు నెలనెలా పట్టుకోమన్నా, అయ్యగారిది మా మంచి మనసు.'

'ఇందుకేనా ఇంతాలీసెం ?'

'అవును' అని ఉదయంనుంచి వాడింత ఆరాట పడింది చెబుతుంటే దాని కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

'ఏం మరోప్పుడు కొనకూడదా? మన మేటి కలిగినోళ్లమా?' అంది వాడిగుండెల్లో తలదాచుకుని ఆ గుండెలస్పందన దాని చెవుల్లో మధురంగా మార్మోగుతున్నది. దానికి ఆ చీరంతా వాడి ప్రేమామయ హృదయంలాగే కనిపించింది ఈ ఆత్మీయతతో మరింత బలంగా వాడి హృదయానికి అంటుకు పోయింది

ఆ రాత్రి జయ నిద్రపోలేదు చాలాసేపు. ఆమె కన్నీళ్ళు దిండులో తలదాచుకున్నాయి.

మరునాడు సాయంత్రం కాపటంతోటే వాసు చంద్రిని తీసుకుని వచ్చాడు

శ్రీధర్ ఉత్సాహంగా పడక కుర్చీలోంచి ముందుకి వంగి కూర్చున్నాడు.

'దండాలయ్య' అంది చంద్రి

'రేత్తిరి కొన్నాబాబు చీర'

దాని ముఖం నిండా సిగ్గు తెరలు కమ్ముకుంటున్నాయి.

అది తలవంచుకునే 'దండాలు బాబు.' అంది.

శ్రీధర్‌కి ఆనందం కలిగింది అంతలో తమ ఇంట్లో పరిస్థితి గుర్తు వచ్చింది జయ చీర కట్టుకోనేలేదు అప్పటికి తను రెండు సార్లు చెప్పి చూశాడు జయ వినలేదు

'నువ్వు డబ్బు ఇవ్వక్కర్లేదురా!'అన్నాడు.

'అదేంటి బాబు' అన్నాడు ఆశ్చర్యంతో.

'అంతేలేరా! మా చెల్లెలవస్తే చీర పెట్టనూ. ఇప్పుడూ అంతే అనుకుంటాను. పో—'

వాడికి అయ్యగారికి ఎలా కృతజ్ఞత చెప్పాలో అర్థంకాలేదు. మనసు మాట్లాడే మాటలు కన్నీళ్లు. శ్రీధర్ పాదాలమీద పడినయి,

'ఛీ ఛీ, ఇదేమిట్రా' అన్నాడు శ్రీధర్.

'లేదుబాబు' అన్నాడు వాసు కళ్లు తుడుచుకొని.

'అమ్మగారిని సూసొత్తా.' అంది చంద్రి లోపలికి వెళ్లబోతూ,

'అమ్మగారు పడుకున్నారు. మరోసారి చూపించవచ్చులే పోయిరండి ఇంటికేనా?' అన్నాడు శ్రీధర్.

'కాదుబాబు సినిమా చూపించమని పాణం తీత్తావుంది'

శ్రీధర్ నవ్వి 'భార్యంటే ఏమను



కున్నావు? పోయొరండి" అన్నాడు.

వాళ్లిద్దరూ నవ్వుకుంటూ వెళ్లిపోయారు.

శ్రీధర్ ఆనందంతో ఆటే చూస్తూ కూర్చున్నాడు.

జయలక్ష్మి అంతా వింటునే వుంది

ఒక్క క్షణంలో అంతా తిరిగి పోయింది ఎంత విశాల హృదయం అతనిది? తనెలా ప్రవర్తించింది?

అతను రాలేదనే బాధపడింది కాని అతని బాధ నర్థం చేసుకోలేదు అప్పటికీ అతను ఖరీదైన చీర తెచ్చాడు, తనని కట్టుకోమని బ్రతిమాలాడు. తను కట్టుకోనన్నప్పుడు అవమానంతో నిండిపోయిన అతనిముఖం చూస్తే తన కెందుకు జాలి కలుకలేదు! తన విలువను అతను గుర్తించలేదనేగాని అతని విలువను తను గుర్తించిందా? అసలాక్షణమే అటువంటిదేమొ? తను విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయింది. శ్రీధర్ తన ఏ కోరిక తీర్చలేదు? కనీసం వాసుకున్న కృతజ్ఞత కూడా తనకు లేదేమొ?

అతనిముందు తన అల్పత్వం బుజువు చేసుకుంది కాని అదృష్టవశాత్తు అతను తన సర్వస్వం 'గనుక సరిపోయింది' మరొక రైతే ఏమై వుండేది?

జయలక్ష్మి మనసు సిగ్గుతో చితికి పోయింది ఆమె మనస్సుకుపట్టిన మబ్బులు చెదిరిపోసాగినయి పశ్చాత్తాపంతో ఆమె నరాలు దహించుకుపోయినయి హృదయంలో శ్రీధర్‌పై ప్రేమగట్లు తెంచుకుంది

అతని మమతని గుర్తించక పోవటం తన దురదృష్టం ప్రతి చిన్న విషయానికి అతన్నుంచి త్యాగాన్నాశించటం తన తెలివి తక్కువ. దానికి అతని ప్రేమకు ముడి పెట్టటం తన అజ్ఞానం. తనది మిథ్యా సంస్కారంకాదా? అదృష్టంకొద్దీ అతనికి తను దూరం కాలేదు

ఆమె కళ్లలో ముత్యాల బిందువులు నిలిచినయి అద్దంలో ఆమె ప్రతిబింబం వణికి పోతున్నది!

ఆమె కన్నీటి బిందువులగుండా శ్రీధర్ జారిపోతున్నాడు. ఆ కన్నీరే ఆమె మానసిక భారాన్ని తొలగించింది

ఆమె మనస్సు తేలిక పడింది

కూర్చున్నవాడల్లా శ్రీధర్ గాజులచప్పుడు విని వెనక్కి తిరిగి చూశాడు

జయలక్ష్మి పసుపుకాళ్లతో శ్రీధర్ తెచ్చిన కొత్తచీర కట్టుకుని వచ్చి అతని కాళ్లకి నమస్కారంచేసి, అంతలో సిగ్గు ముంచుకురాగా అతనికి ముఖం చూపలేక లోపలికి పారిపోయింది ●

ఆగండి!
మీ గుడ్డల ఖర్చు
ఎక్కువై పోతున్నదా?

అయితే ట్విన్ టస్కర్ గురించి మీరు చేసిన దీర్ఘాలోచనకి యిది సరైన సమయం అన్నమాట! ఈ వస్త్రాలలోని వైవిధ్యాన్ని మీరు యిష్టపడతారు.... మధుర మిల్స్ వారి భారీ ఉత్పత్తి అవకాశములవలని గట్టితనము, ఎక్కువకాలం మన్నిక, అద్భుతమైన ఎవితనము, సరసమైన ధర నిర్ణయము సాధ్య పడినవి జ్ఞాపకముంచుకొవండి. సరసమైన ధరకు లభించే నాణ్యతకు ట్విన్ టస్కర్!

మధుర మిల్స్ కంపెనీ లిమిటెడ్, మధురై
మేనేజింగ్ ఏజంట్లు ఎ & ఎఫ్ హార్వే లిమిటెడ్

హార్వే

ట్విన్ టస్కర్

పాప్లిన్ • డ్రిల్ • లాంగ్‌క్లాత

సరసమైన ధరకు నాణ్యత!

మధురకు చేరిన హార్వే